# పిచ్చమ్మమ్మ

[ నాటిక ]

= శ్రీ సోమయాజుల వెంకటరామమూర్తి =

శ్రీ సోమయాజుల వెంకటరామమూర్తి

[ పాత్రలు ]

శ్రీపతిరావుపంతులు—భూస్వామి, ౪౧ సం. వయసు
విమలమ్మ—అతనిభార్య, ౩౧ సం. వయసు
పిచ్చమ్మ—విమలమ్మతల్లి, పూర్వసువాసిని, ౫౨ సం. వయసు
శ్యామల—పంతులకుమార్తె, ఫేషనబుల్, ౧౬ సం. వయసు
నాగభూషణం—పంతులకొడుకు, ౧౨ సం. వయసు
కమల—పంతుల మరియొక కుమార్తె, ౭ సం. వయసు, చాలాచురుకు
డాక్టరు 'దాసు'
'టామీ'—పంతులుగారి పెంపుడుకుక్క

౧

[శ్రీపతిరావుపంతులుగారి యింటి పెరటి వసారా – ఉదయం సుమారు ఎనిమిదిగంటలవేళ.]

విమలమ్మ—(తొందరగా ప్రవేశించి) ఒసేవు, కమలా, ఏంజేస్తున్నావే కొళాయిదగ్గిర ? ఆటబ్బులో నీళ్లన్నీ సబ్బుచేసి తగలెట్టేశావుటే !

(పిచ్చమ్మప్రవేశం - కమల రెక్క పట్టుకొని. కమలమొగాన్ని ఒకవైపంతా సబ్బు అంటి వుంటుంది)

పిచ్చమ్మ—(విమలతో) చూస్తున్నావా, దీని వాలకం ! సరికొత్త సబ్బుబిళ్ల సగం అరగ్గొట్టేసింది– దీనిమొగం తోముకోడం ఇదీను! అదుగో, ఆ శ్యామలుందీ, దీని అక్క–దాన్ని చూసి మరీ పాడైపోతూంది. మా బాగా తయారౌతున్నారు లేవే నీపిల్లలు ! ఇదేమి సంసారమే తల్లీ ! మా కాలపు గుంటలు ఎప్పుడూ ఇలా గుండలేదు!—ఒసేవు అమ్మాయీ, ఈసూటికి ఆవఁదం పట్టి యెన్నాళ్లైందో !

కమల—నే నావఁదం తాగను.

పిచ్చ—తాగవు, పాపం ! తాక్కపోతే నోరు పెగల్దీసి మరీపోస్తాను. ఆవఁదం అంటే ఏమనుకున్నావు! సర్వరోగనివారిణి!...కాఫీ అయిపోయి గంటయింది. ఇంకా వీళ్లేవళ్లూ తెమిలిరారేం చెప్మా! కాఫీలై తేనే గాని వంటపొయ్యిలో నిప్పెయ్యడానికి వీల్లేదు. చద్దన్నం ఊరగాయరోజులు పోయాయి—కాఫీ, ఉప్మారోజులు వచ్చాయి...ఒసేవు విమలా, అల్లుడింకా లేచినట్టు లేదు. ఇదేంపడకో తల్లీ! (పాడుకుంటుంది) "శ్రీరామభూపాలునూ, పట్టాభిషిక్తుడై కొలు వుండగా—"

విమ — (కమలముఖం తువాలుతో తుడిచి) కమలా, నాన్నగారి గదివగ్గిరకి వెళ్లి, నాన్న లేచారో లేదో చూచిరామ్మా!—అక్కడ చప్పుడు చెయ్యకూ, నాన్న కోప్పడతారు.

(కమల నిష్క్రమించును)

పిచ్చ—(పాట)"అయ్యొ మీ రెవ్వరయ్యా
నాగదికి ఆగడంబున వస్తిరీ,
సందుగొందులు చూచియూ
మీ రెంత తప్పుశాయగ వస్తిరీ"

ఏమి సంసారాలు, ఏమి కాపురాలు! మొగాళ్లు బద్ధకిష్టులైపోవడమే ఒక దొరతన మనుకుంటున్నారు. ఆడాళ్లు వేషాలేసుకొని దొరసాన్లయిపోదా మనుకుంటున్నారు. (మెల్లిగా) నీమొగుడు చూడు-పొద్దున్న ఎనిమిదింటికి నిద్దర లేస్తాడు. అక్కణ్ణుంచి ఆస్నానాల గదిలో పావుగంట, అద్దందగ్గిర అరగంట - పూసుకుంటూ, గీసుకుంటూను!- కాఫీ, ఫలహారం, పనికిమాలిన బాతాఖానీ, భోజనం, నిద్ర, మళ్లీ కాఫీ. చూడుకొట్టేసరికి, ఏమిటో రాచకార్యం మించిపోతూన్నట్టు, చేతికర్రుచ్చుకొని క్లబ్బుకి! రాత్రి తొమ్మిది గంటల కిల్లు చేరుకోవడం. అంతసేపు క్లబ్బులో ఏం జేస్తాడో?

విమ —ఏంజేస్తారు? సరదాకి పేకాడుకుంటారు; పేపర్లూ, పుస్తకాలూ చదువుకుంటారు.

పిచ్చ — చదువుతాడు! రయితులువస్తే వాళ్లతో మాట్లాడడానికైనా తెరిపి లేకుండా చదువుతాడు!-సంసారం, పెళ్లాం, పిల్లల్నీ చూచుకోకుండా చదువుతాడు! (తిరిగి పాడుకుంటుంది)

"అని శాంత పలుకగానూ
విని సీత నవ్వుతూ యిట్లానెనూ
మా యన్న ఋష్యశృంగునూ
వనములో కూడి యెడబాయకున్నా
వేమి యెరుగని తపసినీ
ఓవదినె, కేళించి విడిచినావూ"
ఒక్కకానీయెత్తు లాభంలేని చదువు!

(శ్యామల ప్రవేశము)

శ్యామ—చదువువల్ల లాభంలేదనా అంటున్నావమ్మమ్మా? చదువంటే education. అనగా విద్యన్నమాట. విద్య, విజ్ఞానం రెండూ ఒక్కటేను. విజ్ఞానానికివిలువకట్టలేము. It is a priceless treasure.

పిచ్చ—ఓసి నీ ఆస్పీసు ఇంగ్లీషు చాల్లేవే! ఇంగ్లీషు చదవడంవల్ల మీ కొచ్చిందల్లా అహంభావం ఒక్కటే. మా అంతవాళ్లు లేరని ఏంవిర్రవీగుతున్నారే! మరగాళ్లెక్కినట్టు ఎత్తుమడిమజోడు తొడగ్గానే నువ్వు దొరసానివైపోతావూ? నాలుగింగ్లీషుముక్కలు నేర్చుకోగానే నువ్వు పండితురాలివైపోవు. మొగం పూటకి మూడుమూడుసార్లు సబ్బుతో రుద్దగానే నువ్వు తెల్లదానివైపోతావూ? అసహ్యం వొచ్చినట్టు వాళ్లవేషాలంటే వెయ్యగలము కాని, వాళ్ల కూడిక, వాళ్ల పొదుపు మనకు అబ్బవు! ఏం వేషాలొచ్చాయే తల్లీ! (విమలమ్మతో) ఒసేవు అమ్మాయీ, కమలకి ఆవఁదం పడతాను, పిల్చుకురా!

విమల—వాళ్ల తండ్రిని లేపడానికి గదిలోకి వెళ్లింది! అదుగో వస్తూంది.

(ప్రవేశము కమల, పాడుకుంటూ)

"అమ్మమ్మా, పిచ్చమ్మమ్మమ్మా,
మూరెడుముక్కు అమ్మమ్మ
ముక్కుమీద ముద్దరవేసి
ముతకాసున్నం ముగ్గూపెట్టి..."

పిచ్చమ్మ— (కోపంగా) అన్నా, ఆకతాయతనం! నాకు మూరెడు ముక్కేం? — ముద్దర వేస్తావేం?—ముగ్గడతావేం?— దీని కీపాటెవరు నేర్పారూ? (శ్యామల పకపక నవ్వుతుంది) నీ ప్రతాపమే. నాకు తెలీదూ?

(శ్యామల నవ్వుతూ వెళ్లిపోతుంది. పిచ్చమ్మ కమలను వెంటబెట్టగా కమల పారిపోతుంది.)

ఆలాగే వుండు—ఇప్పుడంటే పారిపోయావు కాని, ముద్ద మింగడానికి రావూ? అప్పుడు అప్పడాల కర్రుచ్చుకొని......

(కమల తిరిగి తొంగిచూచును)

కమ—కర్రగానికర్ర జీలకర్ర (పరుగెత్తును)

పిచ్చ—గుంట యేమి మిడిసిపడుతూంది! (పాడును)

"సంపెంగపువులగాలీ
విసరగా తలుపు లప్పుడు వేసిరీ,
మల్లెపూవుల్ల గాలీ
విసరగా శయ్యపై గూర్చుండిరీ.

కీలుకొప్పమర విడచీ
లక్ష్మణుడు నేర్పుతో జడ లల్లెనూ
బొడ్డుమల్లెలు జాజులూ
జడపైని శృంగారముగ జుట్టెనూ
తాంబూలములు శాయుచూ
దంపతులు కలిసి ముచ్చటలాడుచూ
.................."

అమ్మాయీ, ఇదేమి టే-నేను బెంగెట్టుకు చచ్చిపోతున్నాను నీకాపురం చూసి!

విమ—నా కాపురాని కేమిటైం దమ్మా?

పిచ్చ-ఇంకా యేమిటైందని అడుగుతున్నావూ? నీ మొగుడుమాట - ఇంటిపట్టు నుండడం ఎప్పుడూ కనిపించదు. పగలు క్లబ్బు, రాత్రి సినిమాలు. ఇక పెళ్లానివైన నీకు - కొయ్యనున్న అతగాడి కోట్లూ, మూలనున్న చింకిచెప్పులదర్శనం తప్ప పిసరంతలాభం కనిపించదుకదా! ఒక్కనాడు - నువ్వు ముచ్చటగా తలదువ్వుకొని పువ్వులు ముడుచుకొని మొగుడుతో కష్టం సుఖం అనుకోవడం నేనీ పదిహేనురోజుల్లో చూడనే లేదు!

విమ-నువ్వు చూడాలా యేమిటి? దేనికీ లోపం లేకుండా అన్ని ముచ్చట్లూ జరిగిపోతూనే వున్నాయి.

పిచ్చ—నా మొగంలాగు జరుగుతున్నాయి! మనుష్యులైనాక 'నా' అనుకోవాలిగాని-చాలు! - కడుపు నిండిపోవాలి!- నువ్వేఁవంటే అనూ, అల్లుడుచర్య నాకేం నచ్చలేదు.

విమ—అందరు మొగాళ్లూ అంతేను. అందరికంటే ఆయన అధిక మేం శేస్తున్నారు?

పిచ్చ-నీసత్తెకాలమే నిన్నింతమట్టుకు తెచ్చింది. ఏమీ, నీకుమాత్రం సరదా లక్కర్లేదూ? నిన్నీ సంసారానికి ముడెట్టేసి తాను తిరుగుతూంటాడూ అచ్చుకొట్టిన ఆంబోతులాగు? తల్లిప్రాణం కిరకిర కొట్టుకుపోతూం టేను- ఎలా గూరుకొనేది?

(తెరలో శ్రీపతిరావుపంతులు- "ఈ ఇంట్లో వెధవలు నన్ను పడుకోనివ్వరు")

పిచ్చ—అదుగో లేస్తున్నాడు నీ మొగుడు. నాకేం కావాలి? నాలుగు రోజులుండి నామానాన్ని నే బోతాను. ఏమైనా ఉంకబట్ట కంటే ముసిలి ముండనోరు రవ్వంటారు!

(తెర)

౩

[నాటి ఉదయం ౮ గంటలు:

శ్రీపతిరావుపంతులుగారి యింట. ఒకవైపు పడకగది కనిపిస్తూంటుంది- మరియొకవైపున చావడి. చావట్లో బల్లమీద విమలమ్మ కాఫీకి ఏర్పాట్లు చేస్తూంటుంది. ముఖం కలకలలాడుతూనే వుంటుంది- యెంత రోషం వచ్చినా ధుమధుమలాడడం ఆమెనైజం కాదు గనుక. కమల ఒకవారని కూర్చొని కూనురాగం తీసుకుంటూ చింతపిక్కలాడుకుంటూ వుంటుంది.]

కమల— (చింతపిక్కలన్నీ డబ్బాలోని కత్తి, లేచి సినిమావాటంగా గెంతుతూ పాడుతుంది).

"వెళతాడే మాబావ
ఉద్యోగానికి వెళతాడే!
రంగంపట్నం వెళతాడే!
బొగ్గులు మొయ్యా వెళతాడే!"

విమల—(నవ్వి) ఏమిటే ఆపాట?

కమ—బావపాటమ్మా! బావఉద్యోగంపాట! అమ్మా, రంగంపట్నం గంగలో కలిసిం దన్నారు రాత్రి నాన్నగారు – అంటే యేమిటే?

విమ—నాన్నగార్ని లేపావూ?

కమ—లేపుతే నాన్న కసిరారు. 'పో ముండా, అవతలికి' అన్నారు. నాన్నకి కోప మెక్కువ!

విమ—నాన్న రాత్రి క్లబ్బులో, పేకాటలో వోడిపోయివుంటారు. అలాంటప్పుడే నాన్నకి చాలా చీకాగ్గావుంటుంది.

కమ—అమ్మా, నాన్న నాతో ఎప్పుడూ పేకాడరు!

(శ్రీపతిరావుపంతులు అప్పుడే లేచి, పై ప్రసంగం విని ముఖం చిట్లించుకొని, వ్యంగ్యముగా నవ్వి లేస్తాడు. మంచం క్రిందనున్న కుక్కకూడా లేచి తోకాడిస్తుంది.)

శ్రీపతి—ఓ, టామీ, నువ్వుకూడా వున్నావూ మంచంకింద? పాపం! నాతో పడుకుంటావు, నాతోనే లేస్తావు, నాతోనే వుంటావు! నీకూ పని లేదు, నాకూ పని లేదు. కాని మహాపనివున్నట్టుగా ఇద్దరిదీ ఏకరునకసందడి! బాగుంది — యథా యజమానీ, తథా పెంపుడుకుక్కా! (ప్రక్కనున్న స్నానాల గదిలోకి నిష్క్రమి))

(చావడిలో శ్యామల ప్రవేశము, పుస్తకం చదువుకుంటూ)

శ్యామల—

"Full many a gem of purest ray serene
The dark unfathomed caves of ocean bear
Full many a flower is born to blush unseen
And waste its sweetness on the desert air."

(తల్లిని చూచి) అమ్మా, నాన్నగారింకా లేవలేదూ!—నేనీ poem కి paraphrase చెప్పించుకోవాలి. నాన్న ఎప్పటికీ లేవరు–నాకు స్కూలుకి వేళైపోతూంది.

విమ—నాన్న లేచినట్టు లోపల సందడి అవుతూంది.

శ్యామ—ఏడ్చినట్లే వుందమ్మా. ఇవాళ మాకు inspection (తణిఖీ) కూడాను. అందుచేత మా headmistress (పెద్దపంతులమ్మ) మమ్మల్ని అరగంట ముందుగా రమ్మన్నారుకూడాను, మంచి దుస్తు లేసుకొని. అమ్మా, నేనా light purple colour–ఆ లేత ఊదారంగు–I beg your pardon చీర కట్టుకుంటానమ్మా.

విమ—అలాగే కట్టుకో అమ్మా.

(శ్యామల పుస్తకం ప్రక్కా, తండ్రిగది ప్రక్కా ఆత్రుతగా చూస్తూ అసంతృప్తి సూచిస్తూంటుంది.

ప్రవేశం: ఇట్నుంచి నాగభూషణం స్కూలు దుస్తులు వేసుకొని, జంకుతూ. అట్నుంచి ప్రవేశము: శ్రీపతిరావుపంతులు తువాలుతో ముఖం తుడుచుకుంటూను.)

విమ—(భర్తతో) కాఫీ చల్లారిపోతూంది, ముందు తాగండి.

శ్యామ—Papa, నాకు వేళైపోతూంది. ఈ poem కి ముందు paraphrase చెప్పండి.

కమ—నాన్నా, మీరు రాత్రి క్లబ్బులోనే—డబ్బు పోగొట్టుకున్నారని అమ్మ చెప్పింది – ఎన్ని డబ్బులు నాన్నా?

శ్రీపతి—ఇక చాలించండి, వెధవ కబుర్లా మీరూనూ! పెద్దంతరం, చిన్నంతరం లేకుండాను! కాఫీచుక్క నా గొంతుకలో పోసుకోనివ్వకుండా, ఇంతమందీ కందిరీగల్లాగు జుమ్మని ముసురుతే ఏలాగు? (ముగ్గురివైపూ చురచుర చూస్తాడు)

శ్యామ—(తండ్రివైపు తిరిగి కోపంగా చూచి, తల్లితో) నాకు వేళైపోతూందమ్మా. నాన్నగారి కోపానికి reason, rhyme లేకుండావుంది. నే వెళ్తున్నానమ్మా. నా powder puff ఏదీ? (అంటూ నిష్క్ర)

శ్రీపతి—పిల్లొచ్చి గుడ్డుని వెక్కిరించిందని, వేలెడేసి గుంటల కెంతేసి కోపాలు!

విమ—దాని కేదో పాఠం చెప్పారుకారని విసుక్కొని వెళ్లిపోయింది. ఇవాళ వాళ్లకి దొరసాని తణిఖీ అట.

శ్రీపతి—విసుక్కుంటే విసుక్కోనీ–నాకు తీరుబాటైనంతవరకూ ఉండకపోతే ఎవరిదితప్పు? (టేబిలు దగ్గిర కూర్చొని కాఫీ కొంచెం రుచిచూచి, కుమారుడు

నాగభూషణంవైపు చూచి) ఏమోయి, ఏమిటిసంగతి? జీతం కట్టవలసినరోజా, ఏమిటి?—ఇవేళ తారీకెంతా? ౧౫-వ తేదీ. ఔను, నేనే మరచాను, ఇవేళేగా బిలియర్డ్సు ఫైనల్సు

నాగ—జీతం కట్టాలి. అదిన్నీ...

శ్రీపతి—మరింకా యేమిటి?

నాగ—నా progress (ప్రాగ్రెసు) కార్డులో సంతకం పెట్టాలి మీరు.

శ్రీపతి—ఏదీ, చూద్దాం. (నాగభూషణం భయపడుతూ కార్డు జేబులోంచి తీసి తండ్రి కందిచ్చును. శ్రీపతిరావు దాన్ని ఎగాదిగా చూచి) ఇంగ్లీషులో ౭౮%, తెలుగులో ౨౬%—బాగుంది, మాతృభాష గనుక చదవకుండానే వస్తుందనే నిర్లక్ష్యం! మనకి ఇంగ్లీషు రాదు, తెలుగా మరిచిపోయాం!

నాగ— మా తెలుగుపండిట్ చేత మార్కులు పడవు నాన్నా. అరసున్నలు లేవనీ, సంధిదోషాలనీ, వ్యాకరణతప్పులనీ మార్కులు తెగ్గోసేస్తాడు!

శ్రీపతి–అతడిదే పొరబాటన్నావూ!—సరే–లెక్కల్లో '౦' సున్నా - చేగోడీసంపాదించావూ! గాడారివెధవా, నీచదువుకింద ఎంతడబ్బు తగలేస్తున్నానురా, రాస్కెల్. పో, చెప్పులు కుట్టుకో బ్రతుకు! (కార్డు విసిరికొడతాడు.)

నాగ—(కార్డు తీసుకుంటూ) ఇంటి దగ్గర మిమ్మల్ని ఎన్నిమార్లు అడిగినా లెక్కలు చెప్పారు కారు!

శ్రీపతి—ఏమీ, ఎందుకు చెప్పాలీ? చెప్పడం ఎందుకూ? ఆలోచించి లెక్కలు నువ్వే చెయ్యాలి గాని! చెట్టెక్కే వాడికి......కర్ర పెట్టి తోస్తాంటారా?

విమ—(చిరునవ్వుతో) నాన్న లేచేసరికే ఎనిమిదిన్నర అవుతూంటే నీకు లెక్క లేలాగు చెబ్తారు నాయనా?

శ్రీపతి—(కళ్లెఱ్ఱజేసి) ఇదుగో, ఈలాగు నువ్వు ముద్దు చెయ్యబట్టే, నీకొడుకుచదు విలాగేడుస్తూంది! వాడితో సరిగా నువ్వూ ఏకమౌతున్నావు!

(కమల ఏదో పాడుకుంటూంటుంది. తండ్రి కేకలు విని పస్తాయించి, తిరిగీ పాట ప్రారంభిస్తుంది.)

కమ—

"భూషాణుడే, నాగభూషాణుడే
ఏతెంచెనే, మన పట్టణానికీ –
చందురుడటే–తలను చందురుడటే
సర్పంబటే–మొలను సర్పంబటే
భూషాణుడే...............
ఏతెంచెనే, మన పట్టణానికీ —"

అమ్మమ్మ నట్టింట్లో చల్లతిప్పుతూంది – వెన్న అడుగుదాం, రా, అన్నయ్యా! (నాగభూషణం చెయ్యి పట్టుగుంటుంది. నాగభూషణం విదిలించుకుంటాడు.)

నాగ—నాతో మాటాడకు పో!

కమ—పోతాలే. ("అమ్మమ్మా, పిచ్చమ్మమ్మమ్మా, మూరెడుముక్కు అమ్మమ్మా" పాడుతూ నిష్క్రి). పాట విని విమలమ్మ నవ్వువచ్చినా ఆపుకొని, భర్తవైపూ నాగభూషణంవైపూ చూస్తూంటుంది. శ్యామల tip-top గా dress అయి ప్రవేశము. తండ్రివైపు గర్వంగా చూచి మాట్లాడక, తల్లిని చూచి)

శ్యామ—అమ్మా, నేను వెళ్లుతున్నాను. నేను recess లో యింటికి రాను. సరిగా one o'clock కి టిఫిన్ పంపించూ! Don't forget, please!

శ్రీపతి—ఏమిటా హడావుడి! ఇంట్లో తల్లిదగ్గిర కూడా యింగ్లీషుముక్కలే! మాతృభాషని ఆంధ్రం పైని పిసరంత గౌరవం లేదు!

శ్యామ–మా headmistress స్కూలులోఒక్క తెనుగుమాట విని సహించదు. పొరబాటున మాలో మేమేమైనా తెలుగు మాట్లాడుకుంటే, వెంటనే యెండలో నిలబెట్టేస్తుంది!

నాగ — గరల్సుస్కూలు లో పిల్లల కింగ్లీషు బాగా మాట్లాడ్డం వస్తుంది కాని, వ్రాయడం రాదు.

శ్యామ—Boys school లో పిల్లలకి లెక్కలు బాగా వస్తాయి! (నవ్వును)

శ్రీపతి—వాడి మొగం వస్తాయి! భూమండలికి లెక్కల్లో బండిసున్నా వచ్చింది—గొడారి వెధవ!

శ్యామ—ఏదీ, చూద్దాం! (నాగభూషణాన్ని సమీపించును).

నాగ—(మెల్లిగా) గొడారివెధవతో నీకేం పని, పో! నన్ను తిట్టించి, మళ్లీ సిగ్గులేకుండా!

శ్యామ—నేనా తిట్టించాను? silly fellow!—good morning all of you. (టక్కు టక్కుమని నడుచుకుంటూ నిష్క్రమణ)

(నాగ. కళ్లు తుడుచుకొని వెళ్లిపోతూంటే)

విమ—బసి వదలగానే వచ్చి యింత అన్నం తిను. ఈపూట భోజనంకూడా సరిగా చేశావుకావు!

నాగ— (వెళ్లిపోతూ) నాతో మాటాడకు. గొడారివెధవతో నీ కేంపని? (నిష్క్రమణ)

విమ—(రెండడుగులు కుమారునివెంట వెళ్లి తిరిగి వచ్చి) అరుగుమీద వీరవరం రయితులు వచ్చి గంటాయి కూర్చున్నారు- ధాన్యం కొలుస్తామని.

శ్రీపతి-(విసుగుదలగా) నాతో యెందుకూ చెప్పడం? క్లబ్బులో బిలియర్డ్సుమ్యాచి ప్రారంభించి వుంటారు. నేను చూడ్డానికి వెళ్లాలి, గుమాస్తాని కొలిపించుకోమను!

విమ-గుమాస్తా రాలేదు-వాళ్ల పిల్లకేమో సుస్తీగా వుందట-కబురంపించాడు.

శ్రీపతి—అయితే, ఎలాగైనా బతిమాలి, పొరుగింటి నరసయ్యని కొలిపించుకోమందూ!

విమ—బాగుంది, పొరుగుని నేరకవున్నారని మన యింటిపనంతా చేస్తారూ?

శ్రీపతి—నేను చెప్పానని చెబుమా. కార్తీక మాసం - పేలాలకని గంపెడుధాన్యం పారబోస్తే వస్తాడు, తప్పకుండాను.

విమ—అదేదో మీరే చెప్పి వెళ్లండి.

శ్రీపతి—(కోపంగా)ఆ! అలాగేలే!—నాలుగక్షరాలు నువ్వు నేర్చుకొనివుంటే నాకీబాధ తప్పిపోవునా?

విమ—సంసారం, ఎలాగు తప్పుతుంది, ఇది తప్పే బాధకాదు. ఇంతకూ ఈ బాధలన్నింటికీ నేనేకారణం!

శ్రీపతి— క్లబ్బులో తొందరపనుందని ఆలాగన్నాను.

విమ—అదే, మీరు యింటపని వుండి క్లబ్బుకి వెళ్లలేకపోతే, నాదే తప్పు!

శ్రీపతి—నిముషాని కోమాటు నాక్లబ్బో అని పడియేడుస్తారిదేమికర్మం?—ఇదిగో, ఈ బిలియర్డ్సు మ్యాచీలు అయిపోతే క్లబ్బుకి స్వస్తి చెప్పేస్తాను. అప్పుడు నీకు కడుపు నిండుతుందా?

విమ—మీక్లబ్బుకీ, నాకడుపునిండడానికీ ఏమి సంబంధంవుంది? మీరు క్లబ్బుకి వెళుతూనేవున్నారు, నాకు కడుపునిండుతూనే వుంది! మీదయవల్ల అందుకేం లోపం లేదు!

శ్రీపతి—దేనికి లోపం లేదంటావు?

విమ—కడుపునిండా, అన్నానికి!

శ్రీపతి—(లేచి, కొయ్యనున్న కండువా, చేతికర్ర తీస్తూ) నేను తోవలో నరసయ్యతో చెప్పి వెళ్లతానులే. అతడొచ్చి ధాన్యం కొలిపించుకుంటాడు.

విమ—వెళ్తే వెళ్లండిగాని, పాతలెక్కలపుస్తకం ఎక్కడుందో పైని పడేసి మరీ వెళ్లండి. నిరుటిబాకీలు కూడా నరసయ్యను చూడమంటాను.

శ్రీపతి—అవును, మరిచాను. నీ కామాత్రం తెలివుందీ?

విమ—నా తెలివితేటలు పరీక్షించడానికైనా మీకు తెరిపి వుందా యేమిటి?

శ్రీపతి — ఈ బిలియర్డ్సుమ్యాచీలు అయిపోనిద్దూ చూద్దువుగాని! (పెట్టెతీసి చిన్ననోటుబుక్కు భార్యకిస్తాడు)

విమ—చాల్లెద్దురూ. ఆమేచిలైనాక టెన్నిసు మేచిలూ, తరువాత పేకాటమేచీలూ - దీని కంతం యేదీ? క్లబ్బులోనూ, కాలచక్రంలోనూ ఋతువులాలాగు మారుతూనే వుంటాయి! మధ్యమధ్యను భరతనాట్యం పేరిట సానిమేళాలు అవుతూనే వుంటాయి!

శ్రీపతి—అన్నట్టు, బాగా జ్ఞాపకంచేశావు — ఇవాళరాత్రి మిసెస్ భృంగాలక & గోదావరి భరతనాట్యంవుంది క్లబ్బులో! (విలాసంగా భార్యవైపు చూస్తూ, కండువా వేసికొని, కర్రతీసి నిష్క్రి.)

విమ—(భర్త వెళ్లినమార్గాన్ని పావునిముషం చురచురాచూచి) పాడుక్లబ్బు - ఎంతవ్యసనమై పోయింది! సంసారాన్ని మరిపించి, ఇంట్లో ముఖ్యమైనపనులుకూడా చూచుకోనివ్వకుండా, పిల్లల చదువూ, ఆరోగ్యమూకూడా చూచుకోనేందు కవకాశం యివ్వకుండా, ఇంటిదానిమొగం ఏలాగుందో చూడ్డానికైనా వ్యవధిలేకుండా, గృహిణికి తన ముఖం ఏలాగుందో చూపించడానికికూడా వేళలేకుండా!... సంతానం కనడానికిమాత్రం ఎట్టిలోపమూ లేదు. అప్రయత్నంగా, నిర్లక్ష్యంగా, అతిసులువుగా ఆపని సాగిపోతూంటుంది! మా అమ్మ చెప్పినట్టుగా చిలక్కొయ్యకి తగిలించిన ఆయనచేతికర్రా, మంచం క్రింద వరుసగా పేర్చిన పాదరక్షలూ — వీటిదర్శనమే మిగులు! ఈ పురుషులు ఆడాళ్లుకూడా మనుష్యులే అన్నసంగతి బొత్తుగా మరిచిపోతున్నారు. ఏంజెయ్యను? ఆడజన్మ గనుక మింగితీరాలి.

(ప్రవేశము: కమల. వెన్నతింటూ, పాడుతుంది.)

కమ—

"ముక్కూమీద వేలు తీస్తే
ముద్దరపోయి నిద్దరవచ్చే
అమ్మమ్మా పిచ్చమ్మమ్మమ్మ
మూరెడుముక్కూ అమ్మమ్మా!"

(పిచ్చమ్మ చేత్తో కవ్వం పట్టుకొని)

పిచ్చ—నాముక్కువూసు నీ కెందుకే? జానెడున్నావో లేవో, అన్నా! (కమలను వెంటబెట్టును. కమల రెండవవైపు పరుగెత్తి పారిపోవును)

విమ—(నవ్వుకొని) దీని వుకుకుమాత్తనానికీ, దాని దుడుకుతనానికీ సరిపోయింది!

(తెర)

3

[శ్రీపతిరావుపంతులుగారి యింటిలో ఒకగది. గది కొకమూలను బట్టలబీరువా, పుస్తకాల షెల్ఫూ వుంటాయి. మరొకవారని మంచం వుంటుంది. మంచంమీద నాగభూషణం పడుక్కొని వుంటాడు. సమయం నాలుగున్నరగంటలు]

(విమల తొందరగా ప్రవేశము)

విమ—నాయనా, భూషణం, ఒంటిగంట కొచ్చావుకావేం, భోజనానికి ?

(నాగభూషణం మాట్లాడడు)

లే, ఇంత ఉప్మా తిని, కాఫీ తాగుదువుగాని.

నాగ—(ఉప్మా మాట విని కొంచెం చురుగ్గా చూసినా) నా కాకల్లేదు.

విమ—మధ్యాన్నంకూడా భోజనం చేశావు కావు. ఆకల్లేకపోవడ మేమిట్రా, నాసెత్తి!

నాగి—గొడారివెధవతో నీ కేంపని ?

విమ—విసుగుదలతో నాస్నేదో అంటే, దానికింత మొండిపట్టు పడితే ఏలాగు నాయనా?

నాగ—(వెక్కి వెక్కి ఏడుస్తూ) నేను-లెక్కలడుగుతే-కొప్పడ్డం, సున్నావొస్తే - 'గొడారివెధవా' అని తిట్టడం!

(గోడవైపు తిరిగిపోయి ఏడుస్తాడు)

(పిచ్చమ్మ ప్రవేశం)

పిచ్చ—ఒచ్చాడూ, భూషణుడు? ఉప్మా అంటే ఎంతో యిష్టం-లేవడేం? మధ్యాన్నంకూడా తిండీ తిప్పలూ లేదాయిరి!

విమ—అలిగాడు-ప్రొద్దున్నతండ్రికొప్పడ్డారని.

పిచ్చ—ఎందుకూ కొప్పడ్డం?

విమ—లెక్కల్లో బాగా మార్కులు రాలేదని.

పిచ్చ—కుర్రాడికి లెక్కలు రాకపోతే, తండ్రి గదా, తాను శ్రద్ధబట్టి కాస్త లెక్కా డొక్కా చెప్పరాదూ?

(శ్యామల వస్తుంది, స్కూలునుంచి)

శ్యామ—బాగా రాకపోవడం యేమిటి — అసలు సున్నా వస్తేను - లెక్కల్లో - తమ్ముడికి! (ప్రక్కకి నిష్క్రి)

(నాగభూషణం దుప్పటీ ముఖంమీంచి కప్పేసుగుంటాడు. శ్యామల లోనికి వెళ్తుంది).

పిచ్చ—మార్కులు రాకపోతే రాకపోతాయి-తనుక్లజ్బో అని రాత్రీపగలూ అదేపనిగా కూర్చుంటే పిల్లలగతీ, సంసారంగతీ యేమాతుంది? (నాగభూషణం మంచందగ్గరకువెళ్లి) ఒరేయి, భూషణం, లేనాయనా, కొంచెం ఉప్మా రుచిచూద్దువుగాని.

నాగ—నా కాకల్లేదు.

పిచ్చ—ఎందు కాకల్లేదు? మొన్న శనివారం ఆవఃదం యిస్తానంటే వద్దన్నావు! ఆవఃదం తాగుంటే ఈ మందకొడి వొదిలిపోదూ?

(దుప్పటీ యెత్తి నాగభూషణంకడుపు నొక్కి పరీక్షిస్తుంది)

విమ—ఏమిటమ్మా నీచాదస్తం? ఎప్పుడూ ఆవఃదం గోలేను! తండ్రిమీద అలిగి పడుకున్నాడు!

పిచ్చ—(నాగభూషణంతో బుజ్జగింపుగా) లేరా, అబ్బాయీ, ఆకలితో పడుక్కుంటావుట్రా? పోనీ, కాఫీ, ఉప్మా యిక్కడికి తేనా?

(నాగభూషణం మాట్లాడక ఊరకొనును)

(శ్యామల తెల్లనితువాలుతో ముఖం తుడుచుకుంటూ ఇంగ్లీషు ట్యూనులో పాడుకుంటూ ప్రవేశము).

" Tell me not in mourntul numbers
Life is but an empty dream;
For the soul is dead that slumbers,
And things are not what they seem "

పిచ్చమ్మమ్మమ్మా!–my tiffin please!

పిచ్చ—మొగాన్ని చుక్కెట్టుకో, ముందు!

శ్యామ—తమ్ము డుప్మా తిన్నాడా?

పిచ్చ—లేదు.

శ్యామ—ఏమీ, ఇంకా తినలేదా? పోనీ, మాయిద్దరికీ ఇక్కడే తెచ్చిపెట్టు!

పిచ్చ—ఆకలంటే, నిజంగా, అలాగుండాలి! ఆడపిల్లై తేనేం గాక!

(పిచ్చమ్మ, విమల నిష్క్రమింతురు.)

శ్యామ—(మంచందగ్గిరికి కుర్చీ యీడ్చుకొని కూర్చొని) ఒరే, భూషణం, Don't be silly. తిండి మానుకోవడ మేమిటి, foolishness! లే, కూర్చో!

నాగ—(దుప్పటీముసుగులోనుంచే) 'గొడారి వెధవ' అని నాన్నగారిచేత నన్ను తిట్టించి, మళ్లీ సిగ్గులేక మాట్లాడుతున్నావు! - ఆడదానికి సిగ్గుండాలి!

శ్యామ—అలిగిపడుకోవడం అసలైనమొగతనమేనా?

నాగ—నీతో నేను మాట్లాడను. పో, యిక్కణ్ణుంచి.

శ్యామ—నీచేత ఉప్మా తినిపించి మరిపోతాను!

(ప్రవేశము: పిచ్చమ్మ రెండు చేతుల్లో రెండు ఉప్మాప్లేట్లతో. వెనక విమలమ్మ రెండు కాఫీ కప్పులతో. ఆవెనక కమల, ఆ వెనక కుక్క టామీ)

పిచ్చ-ఇదిగో, లేరా నాయనా, - వేడిగా ఆవిరొస్తూంది. నీ కిష్టమొచ్చినంత అల్లం, జిలకర్ర వేశాను. లేచి చూద్దూ, ఒక్కమాటు!

నాగ—నా కక్కర్లేదు!

(శ్యామల ఫలహారం అవలీలగా చేస్తూంటుంది. టామీ చూచి తోకాడిస్తూంటుంది. పిచ్చమ్మ ఒకరెక్కా, విమలమ్మ ఒకరెక్కా పట్టుకొని నాగభూషణాన్ని మంచం నడుమ కూర్చోబెట్టుతారు. నాగ. గోడ కానుకొని కూర్చుంటాడు. పిచ్చమ్మ ఉప్మాప్లేటు అందించగా, మూలిగి అందుకుంటాడు)

శ్యామ-(తనప్లేటువైపు చూస్తూ నవ్వి) ఆకలేస్తే సరి, అన్ని అలకలూ అవలీలగా పోతాయి.

నాగ—(కోపంతో ఒళ్లుముడుచుకొని ఉప్మాప్లేటు కుక్కకి పెట్టి, దుప్పటి కప్పుకొని పడుకుంటాడు. అందరూ నిర్ఘాంతపోతారు)

పిచ్చ— తినబోతూన్నవాడిని దెప్పిపొడిచి తిననిచ్చావుకావు-ఏమిటి సాధనం?

శ్యామ—మరొక్కప్లేటులో ఉప్మా యిక్కడ పెట్టేసి మనం వెళ్లిపోదాం!

విమ—నువ్వు వాడివూ సెందుకు తలపెట్టాలే? అసలేవాడు పొద్దట్నించీ అట్టుడికినట్టుడికిపోతూంటే!

(పిచ్చమ్మ లోపలికెళ్లి మరొక ప్లేటు ఉప్మా తెస్తుంది. అది బల్లమీద పెట్టి, పక్కను తోలి, అంతా అవతలకి నడుస్తారు. గదితలుపు దగ్గరగా వేసినతరవాత ఒకనిముషానికి నాగ. లేచి అటు యిటు చూచి, ఉప్మా ప్లేటు వైపు దృష్టిసారించి—)

నాగ—అల్లంవేసింది!- జీలకర్రవేసింది!- వేడి వేడి ఉప్మా! తిననా, మాననా? కడుపు, తినమని, ఒక వేపునుంచి లాగుతోంది. పౌరుషం తినవద్దని మరొక వైపు ఈడుస్తోంది. ఇప్పుడీ ఉప్మా నేను తినేస్తే ఓడిపోయానన్న! మానేటే తినక పోతే, ఆకలి! — ఏంజేసేది?— రోషం అణుచుకొని ఈ రవ్వంత ఉప్మా నేనుతిన్నానా, శ్యామల మిడిసిపడి, ఆజన్మాంతమూ నన్ను వేళాకోళం చేస్తూనేవుంటుంది. ఆబాధ పడడం మరీకష్టం! తినను, తినను, ముమ్మాటికీ తినను. ఈ ఉప్మా తినను. నిజమే. అయితే, ఆకలిబాధ తీరేటందు కింకేదైనా తినవద్దూ? తినాలి, ఏదైనా తిని తీరాలి, యింటిలో తెలియకుండా. ఏమిటుపాయం?- (ఆలోచన) ఆఁ, బాగుంది-కష్టకాలంలో బుద్ధివికాసం చెందుతుంది. ఆవికాసంతో మానవుడు గొప్ప practical politician అవుతాడు! ఆకలికి అన్యాయం తెలియదు!-అదే ఉపాయం. That is politics!

(లేచి వెళ్లి గదితలుపు గడియపెట్టి, తన పుస్తకాలబీరువా తీసి రెండుపుస్తకాలు చంకలో పెట్టుకొని, గదిలోకీ సందులోకీ వున్న తలుపు తీసి వీథిలోకి వెళ్తూ)

ఈ వెధవ 'యూరపుఖండమూ', ఈ చచ్చు 'హిందూదేశచరిత్రా' బజార్లో అమ్మేసి, నాంచారి హోటేల్లో నాలుగుదోసెలు తినేశానంటే, ఆకలి అబ్బతో చెప్పకొని పరిగెత్తా లన్నమాట!

(తొందరగా నిష్క్రమి)

(తెర)

౪

[శ్రీపతిరావుగారియింటిలో వంటగదిముందర. సమయము-రాత్రి ౭ గంటలవేళ. పిచ్చమ్మ వంట ముగించి గదిగుమ్మంలో పాడుకుంటూ కూర్చుంటుంది.]

పిచ్చ—"కేళికాగృహము జొచ్చి, లక్ష్మన్న
కీరవాణిని జూచెనూ
కోమలికి పాన్పుపైనీ, చెయిముట్టి
కోక సవరించె వేగా
ప్రాణనాయకిపాన్పునా, కూర్చుండి
భాషించె విరహమ్మునా
కొమ్మ నీముద్దుముఖమూ
సేవింప కోరినాడే చంద్రుడూ
అనుచు పావడ ముడవగా
అతివ తా అటమటను కనుల విప్పే..."

(కమల ప్రవేశము)

కమ—అమ్మమ్మా!— పిచ్చమ్మమ్మమ్మా!

పిచ్చ—అమ్మమ్మా అంటే చాలదూ? పేరుపెట్టి పిలవాలీ? లాడితెడు గుంట వున్నావు, ఏం మిడిసి పోతున్నావే?

కమ—అమ్మమ్మా, ఇందాకా నువ్వు పాడిన పాట నాకు నేర్పవూ?

పిచ్చ—పాటా? ఈపాటలు నీ కింకా బోధపడవు. పెళ్లయాక, మొగుడొస్తే, అప్పుడు నీమట్టుకి నీకే బోధపడుతుం దీ పాట!

కమ—(సిగ్గు నటించి) నాకు పెళ్లొద్దు!

పిచ్చ—ఆమాట దేముడే చెప్పాడు, ఈ రోజుల్లో. నాకు మూడోయేట పెళ్ల యిందట, ఎంచక్కా!

కమ—అమ్మమ్మా, పోనీ, కథ చెబుదూ.

పిచ్చ—భోజనా లైనాక చెబుతాలే.

కమ—రెండు పెద్దకథలు చెప్పాలి.

పిచ్చ—నువ్వు రేపొద్దున్న ఆవఁదం తాగుతే నేనివాళ రెండు కథలు చెబుతాను.

కమ—(వినిపించుకోనక) పోనీ, అందాకా పాడనా?

పిచ్చ—ఏమిటి?

కమ—కథలు.

పిచ్చ—ఏదీ, పాడుదు చూద్దాం.

కమ—'ఎందరెక్కినా లొంగని గుర్రం'—ఏమిటి చెప్పుకో, చూద్దాం.

పిచ్చ—(ఆలోచించి) నాకు తెలీదు. ఎదురు పొడుస్తా నుండు. 'సూర్యుడు చూడని గంగా, చాకలి ఉతకని మడుగు'—?

కమ—ఓస్, ఇంతేనా – కొబ్బరికాయ!

పిచ్చ—అబ్బలంజా, చెప్పేశావే! మరొకటి పొడుస్తాను: 'ముక్కు నలుపు చెక్కు లెరుపు. కర్రి సీతాయమ్మ-కథ విప్పి చెప్పు'—?

కమ—(ఆలోచించి) నాకు తెలీదు–చెప్పేనువ్వు.

పిచ్చ–నీది నువ్వు చెబుతే, నాది నేను చెబుతాను·

కమ—అయితే, ఇదుగో ... 'ఎందరెక్కినా లొంగని గుర్రం' ఏమిటంటే—'అరుగు'!

పిచ్చ— (నవ్వి) ఔనే!–నాది చెప్పనా?–'ముక్కు నలుపూ, చెక్కు లెరుపూ'–'గురివిందగింజ'!

(తెరలో గగ్గోలు-విమలమ్మ కేక వేస్తూంటుంది: "అమ్మా, అమ్మా, ఒక్కమా టిలాగు రా వేగం–")

పిచ్చ—(దిగ్గున లేచి) ఏమిటే ఉపద్రం?

విమ—(తొందరగా ప్రవేశించి) భూషణుడికి-ఏమిటైందో నే! - చాలా బాధపడిపోతున్నాడే-కడుపూ గుండెలూ ఊరికే తడుముకుంటున్నాడే.

పిచ్చ—కొంపదీసి ఏమీ తాగలేదుగద!

విమ—అదేమో నే?–నాకేందారి?–శ్యామ లేదీ? ఒసేవ్, శ్యామలా, వేగం రావేవ్! తమ్ముడు స్థితేం బాగు లేదేవ్!-అయ్యో, నాకేం దారి?

శ్యామ—(తొందరగా ప్రవేశించి) ఏమిటైందమ్మా, తమ్ముడుకీ?

విమ—ఏమిటో నే. నువ్వు నాన్నగారికి వేగం 'ఫోన్' చెయ్యవే! ఆదిక్కుమాలిన క్లబ్బుకి! నుంచున్నపాటున డాక్టరుగార్ని కూడా వెంటబెట్టుకొని కారులో రమ్మనవే!-అయ్యో, అయ్యో, నాకేం తోచకుండా వుంది!

(అందరూ నాగ. గదివైపు పరుగెడతారు)

[దృశ్యాంతరము: నాగభూషణం గది. పిచ్చమ్మ మంచందగ్గిరా వెళ్లి నిలుచుంటుంది. విమలమ్మ యేడుస్తూ మంచం అంచున ఆనుకొని చూస్తూంటుంది. కమల తెల్లబోయి, తల్లికొంగుపట్టుకొని మంచంవైపూ, తల్లి ముఖంవైపూ చూస్తూంటుంది. శ్యామల టెలిఫోన్ దగ్గర వుంటుంది.]

శ్యామ—(టెలిఫోన్ వద్ద) హెల్లో! నాన్నగారూ! మీరేనా?—ఆఁ-వేగంగా యింటికిరండి. భూషణం seriously ill–డాక్టరుగార్ని వెంటబెట్టుకొని, ఆఁ?–తెలీదు-చాలా ఆయాసపడుతున్నాడు. (రిసీవరు పెట్టేసి మంచవద్దకు వచ్చి నిలుచుంటుంది.)

పిచ్చ—నాయనా, భూషణం, ఇటు చూడమ్మా, భూషణం!

నాగ—ఊఁ అమ్మో!—ఓర్నాయనో (ఏడుస్తాడు.)

పిచ్చ—(విమలమ్మతో) పీడ సోకిందేమో నే! గదిలో ఒక్కడూ, చీకట్లో వుండడంమూలాన్ని జడుసుకొని వుంటాడు—విభూతి పట్రా!

(విమలమ్మ నిష్క్రమించును)

శ్యామ—పీడా లేదు పిశాచం లేదు, కడుపు నొప్పేమో!

పిచ్చ—ఏమితిన్నాడు, కడుపునొప్పికి? పెట్టిన ఉప్మా అదుగో పెట్టినట్టే ఏడుస్తూంది! వేలేసి ముట్టుకోలేదు. కడుపునొప్పేమిటే, నా మొగం!

శ్యామ—అజీర్ణంగా వుండబట్టే ఆకల్లేదు. ఆకల్లేదు గనుకనే ఉప్మాతినలేదు. అందుచేత అజీర్ణంచేత వచ్చిన కడుపునొప్పి ఎందుకు కాకూడదు?

(విమలమ్మ విభూతిపండుతో ప్రవేశము)

విమ—మీలో మీరు వాదించుకుంటూ కూర్చుంటా రేమికర్మమే? అసలు బాధేమిటో వాణ్ణడిగి తెలుసుకోరాదూ?

పిచ్చ— నాయనా, ఊష్టంవచ్చిందట్రా? చలి వేస్తూందా? (చెక్కిట చెయ్యి వేస్తుంది)

నాగ—నొప్పి - అయ్యో! (కడుపు నలుపుకుంటాడు)

పిచ్చ—కాలు నొప్పా? - ఇవాళ నువ్వు బంతాటకికూడా వెళ్లలేదే!

శ్యామ—వాడు కడుపు నులుపుకుంటూంటే, కాలునొప్పా అని ప్రశ్నిస్తున్నావు!

నాగ—అయ్యో! పొత్తికడుపుకింద నొప్పి!

విమ— నాయనా, తొందరపాటున ఏమీ తాగలేదు కద!

నాగ—ఉ, హు, హు, హు, హూ-నొప్పే! గుండెల్లోకి తంతోంది. బాబో! (వెక్కి ఏడ్చును)

పిచ్చ—కడుపునొప్పేనే, సందేహం లేదు. గిద్దెడావదంకాచి, పట్టేసి, కడుపెర్రగా కాచేస్తే......

విమ—ఏమో, ఒకదాని కొకటౌతుంది - మనమేమీ చెయ్యోద్దు ఆయన డాక్టర్ని తీసుకొస్తారు. డాక్టరేలాగు చెబితే అలాగు చేద్దాం.

పిచ్చ—ఆయ నెవరు? దిక్కుమాలినక్లబ్బుకాదు గాని, ఇదేమిటమ్మా దురాన్యాయం; యింటిపట్టు నుండకుండానూ?

విమ—బాగుంది! ఆయన్నెందుకూ నిందించడం! ఈలాగౌతుందని ఆయనమాత్రం కలగన్నారా ఏమిటి?

నాగ—యూరపుఖండ మమ్మేశానూ!-ఉహు హుహు.

విమ— చూశావా, పలవరింతలూ - ఏమిటి సాధనం?

నాగ—హిందూదేశచరిత్ర తాకట్టు పెట్టాను! ఉహూహుహు!

శ్యామ—ఏమిటే అర్థంలేని మాటలు!

పిచ్చ—నాయనా, పొత్తికడుపు కాచనా?

నాగ—అయ్యో!- అయ్యో!-నాంచారీ!-నాంచారీ!

శ్యామ—నాంచారెవరూ?

విమ—అదేమో, నాకేం బోధపడకుండా వుంది.

పిచ్చ—పీడో, పిశాచమో అయ్యుంటుంది.

(తెరలో కారు చప్పుడు. రెండు నిముషాలకి డాక్టరు దాసుగారూ, శ్రీపతిరావుపంతులూ తొందరగా ప్రవేశము.)

డాక్ట—(మంచందగ్గిరా వెళ్లి) నాగభూషణం?

నాగ—ఊఁ—

డాక్ట—నొప్పా?

నాగ—కడుపులో— ఉహుహుహు!

డాక్ట—(కడుపునొక్కి, చెయ్యిచూచి) ఏమిటి తిన్నావోయ్?

పిచ్చ—పొద్దుటనుంచీ ఒక్క మెతుకైనా ముట్టుకోలేదు, నాయనా! అదుగో పెట్టిన ఉప్మా పెట్టినట్టే వుండిపోయింది. పాపం, వాడికిష్టమని అల్లంవేసి, జీలకర్రపోపేసి ఎంతో శ్రద్ధగాచేశాను! వేలేసి ముట్టలేదు

శ్రీపతి — ఉండవమ్మా, నీగోలా నువ్వూను. అసలు సంగతేమిటో డాక్టరుగార్ని కనుక్కోనీ!

పిచ్చ — అయ్యోనాయనా, నేనేం ఆటంకపెట్టానా యేమిటి? కనుక్కోడాని కేముంది? కడుపునొప్పి!-గిద్దె డావదం......

శ్రీపతి—నీ ఆవదం బంగారంగానూ!-ఉండవమ్మా అంటే నోరు మూతెట్టుకో విదేమికర్మం?— డాక్టరుగారూ, **let us not mind the old lady.** మీరు దయచేసి కుర్రాణ్ణి పరీక్ష చెయ్యండి!

డాక్ట—అబ్బాయీ, నాగభూషణం, ఏమిటో సరిగా చెప్పు!

నాగ—నొప్పి!-బాబోయి!-భరించలేను!

(మంచంమీద చుట్టుకుపోతాడు)

డాక్ట— **It is a case of colic!** కడుపునొప్పే! సందేహం లేదు. **The old lady is right!**— అవ్వగారూ, ఎర్రగా నిప్పుచేసి, బాగా రెండు ఔన్సుల ఆవదం మరిగించి తీసుకురండి! అది పట్టేసి, కడుపెర్రగా కాచండి!

పిచ్చ—నేను మొదట్నుంచీ ఘోషపెడుతూనే వున్నాను 'ఆవదమర్రా, కడుపునొప్పర్రా' అని. నామాట ఎవరు లక్ష్యపెడతారు నాయనా!

(లోపలికి వెళ్లును)

డాక్ట—(మంచంఅంచున కూర్చొని) నాగభూషణం ఇటు చూడు. నే నడిగినప్రశ్నకి సరిగా

జవాబు చెప్పు! నువ్వు ఇవేళసాయంత్రం ఏమిటి తిన్నావు?

నాగ— సాంబారిదోసెలు నాలుగూ!-మరే వచ్చి......

డాక్ట—ఇంకా?

నాగ—అర్ధణా వేరుసెనగకాయలు! - సాతాలించిన సెనగలు-పెరుగ్గారెలూ!

డాక్ట—ఇంతమట్టుకేనా!

నాగ—అంతేనండోయి, బాబోయి!

శ్రీపతి—(భార్యవైపు తిరిగి) వీడికి డబ్బ లెక్కడివీ?

విమ—అదేమో? నేను దమ్మిడీ యివ్వలేదు.

నాగ—యూరపుఖండం అమ్మేశాను. బాబోయి! హిందూదేశచరిత్ర తాకట్టుపెట్టాను. హుహుహు.

శ్రీపతి—పుస్తకాలట్రా?

శ్యామ—వాడి టెక్స్టుబుక్కులు కాబోల్ను!

నాగ—ఔను-ఉహుహుహుహూ!

(ప్రవేశం పిచ్చమ్మ-కుంపటి, నిప్పు, ఆవఁదం గిన్నెతో)

డాక్ట—కొంచెం చల్లారనీండి! అవ్వగారూ, మీ పేరేమిటండీ?

కమ— (ముందుకు తోసుకొనివచ్చి) మా అమ్మమ్మ పేరే-పిచ్చమ్మమ్మమ్మ!

డాక్ట--(నవ్వి)ఇదిగో, పిచ్చమ్మగారూ, మీరు పెద్దవాళ్లు, అనుభవజ్ఞులు. పిల్లలకి అధమం రెండునెలల కొకసారి తప్పకుండా ఆవఁదం పట్టేస్తూండండి!

పిచ్చ—నామాట ఇక్కెడెవరికి లక్ష్యం బాబూ! ఈముసిలిముండ చెప్పడం, మేము వినడమూనా అని... నామాటంటే ఈ యింట చంటిగుంటకూడా ఖాతరీ చెయ్యదు. ఇంతకూ—మొగాడన్నవాడూ, యింటి యజమానీ స్వయంగా భార్యాపిల్లలూ, సంసారం అనుకోవాలికాని, బుల్లాడిమేచీలనీ - సానిమేళాలనీ - క్లబ్బనీ—గాడిద......

శ్రీపతి—తిరిగితిరిగి ముక్తాయింపు నామీదికీ, నా క్లబ్బుమీదికీ వొచ్చిందీ?

విమ—ఔను మరి - ఆడవాళ్లం ఎన్నింటికని చావడం?

శ్యామ—అమ్మమ్మ చెప్పినమాట నిజమేనూ! ఇవాళ morning మీరు నా poem కి paraphrase చెప్పకుండా వెళ్లిపోయారుకారూ?

నాగ—నేను రోజూ లెక్కలుచెప్పమంటే, కసిరేస్తూ వచ్చి, లెక్కల్లో నాకు 'జీరో' వచ్చిందని 'గాడారి వెధవా' అని తిట్టడం! (ఏడుస్తాడు.)

విమ—ఈముప్పంతా అందుకే! అలిగి అడ్డమైన గడ్డీ తినేశాడు.

శ్రీపతి—నేను తినమన్నానా యేమిటి?

వి—ధాన్యం కొలిపించుకుందుకి కూడా మీకు తీరిక లేదాయె! బ్రతికీ బ్రతుకక్కంటే, భార్యాబిడ్డల కంటే క్లబ్బెక్కువ మీకు!

శ్రీపతి—నువ్వూ ఆరంభించావూ?

కమ—(తండ్రి కెదురై) నాతో పేకాడమంటే ఎప్పుడైనా ఆడారా యేమిటి? క్లబ్బులో ఆడి డబ్బు లోడిపోతారుగాని!

శ్రీపతి—మీ అందరి మొర్రా నాక్లబ్బు గురించే అయితే ఇదిగో- ఈవేళ- డాక్టరు దాసు గారి యెదుట ప్రమాణం చేస్తున్నాను. రేపట్నుంచీ క్లబ్బుకి వెళ్లను. అనగా-ఒకవేళ వెళ్లినా గంటకంటె ఎక్కువ సేపుండను! సరా?

విమ—అదిగో, పెట్టారూ హంసపాదు?

శ్రీ—పోనీ, మొదలంటా మానేస్తాను. తృప్తేనా?

డాక్ట—(నవ్వుకొని) ఆవఁదం చల్లారుంటుం దీపాటికి! పిచ్చమ్మగారూ, పట్టేయండి. నేను వెళ్లి మందుపంపిస్తాను. Good night Mr. Rao(నిష్క్ర.)

పిచ్చ—(నాగభూషణం నోటివద్ద ఆవఁదంగిన్నె వుంచి) తాగు, నాయనా! డాక్టరుగారు చెప్పారు, చూశావా? ఏదీ 'ఆ' అను. (పోసి) వాతాపిజీర్ణం, పోతాపిజీర్ణం - సుర్రంతిన్న సుగ్గిళ్లు - ఏనుగుతిన్న వెలంకాయ - హనుమంతుడు తెచ్చిన సంజీవి!—

కమ— (తండ్రిచెయ్యి పట్టుకొని) నాన్నగారూ, పేకాడుకుందాం రండీ!

[తెర]